క్లుప్తంగా

100 శాతం జీఈఆర్ సాధించాలి

కర్నూలు(సెంట్రల్): నూరు శాతం జీఈఆర్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్) సాధించేందుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. శనివారం ఉదయం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై కలెక్టర్లు, జేసీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...100 శాతం జీఈఆర్ సాధనంలో భాగంగా 11,12 తరగతుల విద్యార్థులను విద్యా సంస్థల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో పరీక్షలురాసిన ఇంటర్మీడియట్ విద్యార్థుల ఉత్తీర్ణత ప్రమాణ పత్రాలు డిజిలాకర్‌లో పొందుపరిచినట్లు చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ఆశా వర్కర్లతో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, హౌసింగ్‌పీడీ సిద్ధలింగమూర్తి, సీపీఓ అప్పలకొండ పాల్గొన్నారు.

అంబేడ్కర్ మందిరం ఆవిష్కరణకు తరలిరండి



మాట్లాడుతున్న వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు

కర్నూలు(అర్బన్): ఈ నెల 20వ తేదీన విజయవాడ ఉండవల్లిలోని రాజగృహ ప్రాంగణంలో డా.బీఆర్ అంబేడ్కర్ పాలరాతి విగ్రహం, పాలరాతి మందిరం ఆవిష్కరణ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుంగా రత్నప్రదీప్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వీలుగా శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సంక్షేమ సంఘం ఏర్పడి 80 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం సంయుక్త కార్యదర్శి శిఖినం శాలెంరాజు, జిల్లా అధ్యక్షుడు వీఎం వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షులు ఎన్‌సీహెచ్ బజారన్న, ప్రధాన కార్యదర్శి ఎస్ సుంకన్న, ఉపాధ్యక్షుడు సి. సుంకన్న, సీనియర్ న్యాయవాది వై జయరాజ్, వివిధ బహుజన, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ సమన్వయకర్త, సంఘ సేవకురాలు వేల్పుల జ్యోతిని ఘనంగా సన్మానించారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని, నియమిత జీవితశైలిని అలవరచుకోవాలని జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ సీఈవో డాక్టర్ చంద్రశేఖర్ చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్, భారత్ గ్యాస్ రీజనల్ కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం భారత్ గ్యాస్ టెరిటరి కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్డియాలజిస్టు డాక్టర్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఇటీవల కాలంలో చాలా మంది గుండెజబ్బుల బారిన పడుతున్నారన్నారు. కంటి వైద్యులు డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ డ్రైవర్లు తరచూ కంటి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో భారత్ గ్యాస్ టెరిటరి ప్లాంట్ మేనేజర్ తుషార్ జగదాప్, అరుణ్‌కుమార సూర్యప్రకాష్, లయన్స్ జిల్లా అడిషనల్ కేబినెట్ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

రూ.61 లక్షలతో స్టేడియం



ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీపీఓ జేడీ ఎల్.అప్పలకొండ

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మండల గొందిపర్లలో ఎంపీ ల్యాడ్స్ రూ. 61 లక్షలతో ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నట్లు సీపీఓ జేడీ ఎల్.అప్పలకొండ తెలిపారు. శనివారం ఆయన స్టేడియం నిర్మాణ పనులను పరిశీలించారు. స్టేడియం అందుబాటులోకి వస్తే గ్రామీణ క్రీడాకారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. నాణ్యత లేకుండా పనులు చేపడితే బిల్లులు మంజూరు చేయబోమని కాంట్రాక్ట్ ఏజెన్సీలను హెచ్చరించారు. పీఆర్ ఎస్‌ఈ సుబ్రమణ్యంతోపాటు పలువురు ఇంజినీర్లు ఆయన వెంట ఉన్నారు.

స్పాట్ బిల్లింగ్ పూర్తి కావాలి

కర్నూలు(రాజ్‌విహార్): స్పాట్ బిల్లింగ్ ప్రక్రియను సోమవారంలోగా పూర్తి చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. శనివారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిల్లింగ్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి, బిల్లుల వసూలుపై దృష్టి సారించాలన్నారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

325 మంది గైర్హాజరు

కర్నూలు (న్యూసిటీ): ఆర్‌యూ పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు శనివారం 325 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 16 కేంద్రాల్లో జరుగుతున్న బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు 2,956 మంది గానూ 2,631 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ఆయా కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆయన తెలిపారు.



మెడికల్ క్యాంపులో ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్‌నగర్‌లో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని ఈ శిబిరాన్ని సందర్శించి అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల పేద ప్రజలు వైద్యానికి ఇబ్బందులు పడకూడదని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశారన్నారు. ఆయా కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించారన్నారు. ప్రస్తుతం ఆరోగ్య సురక్ష ద్వారా ఏడు రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి కేంద్రంలో ఇద్దరు పీహెచ్‌సీ డాక్టర్లు, ఇద్దరు స్పెషల్ డాక్టర్లను అందుబాటుల్లో ఉంచామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ (కల్లూరు అర్బన్ క్లస్టర్-2 అధ్యక్షుడు) శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శివ, గోపీనాథ్, సిరాజ్, ఉస్మాన్, ముల్ల హుస్సేన్, రామాంజనేయులు, వైద్యాధికారులు, ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం తనిఖీ

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని ముజఫర్‌నగర్‌లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. రామగిడ్డయ్య తనిఖీ చేశారు. శిబిరంలో రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు అవసరమైన రక్తపరీక్షలు, మందులు, వైద్యుల సేవల గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన పలువురికి జగనన్న ఆరోగ్య సురక్ష ఫోల్డర్స్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఆయన వెంట మాస్ మీడియా అధికారిణి ప్రమీలా దేవి, వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.

చెంతకే సర్కారు సేవలు

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): గతంలో ఎప్పుడూ లేని విధంగా జగనన్న పాలనలో ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు ప్రజల చెంతకే వస్తున్నాయని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం స్థానిక 23వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బి. క్యాంప్ క్వార్టర్స్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల మంజూరు, చేకూరిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలు విన్న ఆయన వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం తేవాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుచితరాణి, సునీల్, ఏసన్న, గిరి, ప్రవీణ్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

నియోకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం ఆయన స్థానిక పాతబస్తీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ కార్యక్రమంలో భాగంగా వినతిపత్రాలు స్వీకరించారు.

మహిళలు ఉపాధి రంగాల్లో రాణించాలి

మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ కేంద్రాలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇందులో ఐదు సెంటర్లకు 50 కుట్టు మిషన్లు, 5 వర్లాక్ మిషన్లు అందజేశారు. స్థానిక మహమ్మదీయ వక్ఫ్ కాంప్లెక్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేస్తోందన్నారు. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో ఇప్పటికే రూ.12లక్షలు మైనారిటీ మహిళల వివాహాలకు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వక్ఫ్ కాంప్లెక్స్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ ఇనాయత్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యంతో మహిళల్లో రక్తహీనతకు చెక్



వంటకాలను పరిశీలిస్తున్న జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్) : ఫోర్టిఫైడ్ బియ్యంతో తయారు చేసిన ఆహార పదార్థాలు బలవర్ధకమైనవని, వాటిని ఆహారంగా తీసుకోవడంతో మహిళల్లో రక్తహీనతను నివారించవచ్చని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య చెప్పారు. శనివారం ప్రభుత్వ టౌన్ మోడల్ పాఠశాలలో ఫోర్టిఫైడ్ బియ్యం, మిలెట్లతో తయారు చేసిన వివిధ రకాల వంటకాల స్టాల్‌ను ఆమె ప్రారంభించారు. దాదాపు 50 రకాల వంటకాలను ఆమె రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....సాధారణ బియ్యాన్ని విటమిన్‌లు, ఖనిజాలు, లవణాలను జోడించి రూపొందించిన బియ్యమే ఫోర్టిఫైడ్ రైస్ అన్నారు. ప్రజా సరఫరాల కింద ప్రభుత్వం బియ్యం, గోధుమపిండి, చెక్కర, దాల్‌తోపాటు కొత్తగా టేక్ హోంరేషన్ కింద రాగులు, ఆటుకులు, ఖర్జూరతోపాటు 3 కేజీల బియ్యం ఇస్తున్నారన్నారు. టేక్ హోం కిట్లను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మహిళలకు అందజేస్తున్నట్లు చెప్పారు. మిలెట్లు, ఫోర్టిఫైడ్ రైస్‌తో తయారు చేసిన ఆహార పదార్థాలను బాలింతలు, గర్భిణులు, రక్తహీనతతో బాధపడే మహిళలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎం షర్మిళ, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ, , డీఎస్‌ఓఆచార్యులు పాల్గొన్నారు.

డయాబెటీస్‌నూ నయం చేయొచ్చు



మాట్లాడుతున్న డాక్టర్ పి. శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): ప్రాథమిక దశలో గుర్తిస్తే డయాబెటీస్ వ్యాధిని పూర్తిగా నయం చేయొచ్చని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ పి. శ్రీనివాసులు చెప్పారు. శనివారం ఆయన తన ఛాంబర్‌లో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసెర్చ్ సొసైటీ ఫర్ స్టడీ ఆఫ్ డయాబెటీస్ ఇన్ ఇండియా నేతృత్వంలోని ఏపీ స్టేట్ చాప్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన కర్నూలులోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 7వ రాష్ట్ర స్థాయి కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాలేజీ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇలాంటి వైద్య సదస్సుల వల్ల వైద్యులు, వైద్య విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని, ఆధునిక అప్‌డేట్స్ తెలుసుకునే అవకాశం ఉందన్నారు. తద్వారా రెండు క్రెడిట్ అవర్స్ సాధిస్తారన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఈ కాన్ఫరెన్స్‌లో భాగంగా షుగర్ వల్ల వచ్చే అనేక రకాల సమస్యలకు పరిష్కారాల గురించి నిపుణులైన వైద్యులు చర్చిస్తారన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు చిదంబరరావు వీధిలో ఉన్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న వంటల పోటీలో విజేతలైన మహిళలకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఐ. విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ 5వ తేదీన కేక్స్, మిల్లెట్స్, రెండో రోజు నాలుగు రకాల బిస్కెట్స్, మూడవ రోజు ఇంటివంటలు తయారు చేసి ప్రదర్శించినట్లు తెలిపారు. ఇందులో ప్రథమ బహుమతి చైతన్య, ద్వితీయ బహుమతి సుకన్యకుమారి, తృతీయ బహుమతి లక్ష్మీబాయితో పాటు మరో ఐదుగురు కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ డి. శ్వేతారెడ్డి, టీవీ. రత్నప్రసాద్, కె. మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

27న ఓటరు ముసాయిదా జాబితా

కర్నూలు (సెంట్రల్): ఓటరు ముసాయిదా జాబితాను ఈనెల 27వ తేదీన విడుదల చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని పాణ్యం నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లోని 6,7,8 ఫారాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఓటరు పరిశీలన చేయకుండానే బీఎల్‌ఓలు ఓటర్లను తొలగించడంపై రాజకీయ పార్టీల ప్రతినిధులు ఫిర్యాదు చేయగా పూర్తిస్థాయి విచారణ జరపాలని అధికారులను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో ఓర్వకల్లు, కల్లూరు తహసీల్దార్లు రమేష్ బాబు, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

బీపీఎస్‌కు రెండు రోజులే గడువు

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకోవాలని ప్రభుత్వం బీపీఎస్ పథకాన్ని తీసుకొచ్చింది. 2018 సంవత్సరం నుంచి పలుమార్లు గడువును పొడిగిస్తున్నా అక్రమ భవన యజమానుల్లో స్పందన లేదు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది సైతం పెద్దగా పట్టించుకోకపోవడంతో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 2,200 వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో నగరపాలక ఉన్నతాధికారులు ఎట్టకేలకు స్పందించారు. మరో రెండు రోజుల వ్యవధిలో గడువు ముగియనుండటంతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది పెండింగ్ దరఖాస్తులు ఉన్న ఇళ్లకు వెళ్లి గోడలకు సిరాతో రాశారు. తక్షణం స్పందించి క్రమబద్ధీకరించుకోవాలని లేకుంటే చర్యలు ఉంటాయని టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం వెల్లడించారు.

వ్యక్తిత్వ నిర్మాణంలో సాహిత్యానిది కీలక పాత్ర

- సెర్ఫ్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్



సెర్ఫ్ సీఈఓను సన్మానిస్తున్న కళాశాల కరస్పాండెంట్, సదస్సు నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: ఒక వ్యక్తి యొక్క వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో సాహిత్యం కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్ర అడిషనల్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, ప్రిన్సిపల్ సెక్రటరీ మైనార్టీ సంక్షేమ శాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. ఉస్మానియా కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో శనివారం 'సయ్యద్ సలీం సాహిత్యం - సామాజిక చైతన్యం' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విజయానికి అడ్డదారులంటూ ఏమీ ఉండవని, అలాగే డబ్బు సంపాదనే జీవితంలో ముఖ్యం కాదన్నారు. ఇతరులకు సేవ చేయడంలోనే నిజమైన ఆనందం ఉంటుందన్నారు. ఐఆర్ఎస్ అధికారిగా అడిషనల్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ స్థాయికి చేరుకున్న సయ్యద్ సలీం ఇంతటి విస్తృతమైన సాహితీ రచనలు చేయడం అభినందించదగిన విషయమన్నారు. ఉస్మానియా కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ అజ్రా జావెద్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రచనలు చేయడం ప్రారంభించాలన్నారు. వ్యక్తిత్వ వికాసానికి ఇలాంటి సదస్సులు ఉపయోగపడతాయన్నారు. ప్రారంభ సమావేశానికి అధ్యక్షత వహించిన ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజంమిల్ మాట్లాడుతూ సలీం తెలుగులో 30 నవలలు, 9 కథా సంపుటాలు, 3 కవితా సంపుటాలు వెలువరించారన్నారు. రచయిత సయ్యద్ సలీం మాట్లాడుతూ కష్టాలను అధిగమించే శక్తి విద్య ఇస్తుందన్నారు. అందుకు తానే ఓ ఉదాహరణ అని అన్నారు. సదస్సులో కీలకోపన్యాసం చేసిన ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత తెలుగు ఆచార్యులు వెలుదండ నిత్యానందరావు సలీం రచనలలో ఉండే వ్యక్తిత్వ వికాస అంశాలను వివరించారు. సదస్సు కన్వీనర్, కళాశాల తెలుగు శాఖ హెచ్‌ఓడీ డాక్టర్ మండి అన్వర్ హుసేన్, తెలుగు అధ్యాపకులు కె. అరుణాదేవి, ప్రముఖ విమర్శకులు అశోక్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ సుశీలమ్మ, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): సర్వ శిక్ష అభియాన్‌లో పనిచేస్తూ అకాల మరణం పొందిన రమణ కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు శనివారం ఓ ప్రకటనలో కోరారు. రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా దుదల చేయాలని కోరారు.

పేదల పక్షపాతి ఎస్ఆర్ శంకరన్

కర్నూలు(సెంట్రల్): రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ పేదల పక్షపాతి అని, ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని సీపీఐ నాయకులు ప్రకటించారు. శనివారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని సీపీఐ కార్యాలయంలో ఏపీ వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి అవుల శేఖర్, నాయకులు జగన్నాథం, రామకృష్ణారెడ్డి, వి.నాగరాజు, పాల్గొన్నారు.

డిసెంబర్ వరకు నీరివ్వాలి

కర్నూలు(సెంట్రల్): ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ ఆయకట్టుకు డిసెంబర్ వరకు నీటిని విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

కర్నూలు (న్యూసిటీ) : ఎవరైనా అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. నన్నూరుకు చెందిన సుంకన్న ప్రభుత్వానికి సంబంధించిన భూముల్లో ఎలాంటి అనుమతి తీసుకోకుండా క్రేన్‌ల ద్వారా మట్టిని తవ్వి లారీల్లో తరలిస్తున్నాడనే సమాచారంతో శనివారం తనిఖీ చేశారు. సదరు వ్యక్తికి నోటీసులు జారీచేసి క్రేన్ సీజ్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

రెండు పోలింగ్ కేంద్రాల మార్పు

కల్లూరు: అర్బన్ పరిధిలోని 105, 108 పోలింగ్ కేంద్రాలను కల్లూరు ఎస్టేట్‌లోని శాంతినికేతన్ స్కూల్‌లో ఏర్పాటు చేయనున్నారు. శనివారం జేసీ, పాణ్యం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నారపురెడ్డి మౌర్య.. తహసీల్దార్ టీవీ రమేష్ బాబుతో కలసి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. 105, 108 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లందరూ కల్లూరు ఎస్టేట్, చింతలముని నగర్ ప్రాంతాలకు చెందిన వారు ఉండడంతో ఈ కేంద్రాలను మారుస్తున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మికం

భక్తిశ్రద్ధలతో పారాయణం

కల్లూరు: అవధూత రామిరెడ్డి తాత సేవా సంస్థానంలో శనివారం భక్తిశ్రద్ధలతో శ్రీ లలిత సహస్ర నామ పారాయణం, చక్ర కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. లలిత కామేశ్వర స్వామి సేవాసమితి, సనాతన ధర్మం గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాతృమూర్తులందరికీ తాత సేవా సంస్థాన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కమిటీ సభ్యులు తాంబూలాలు అందించి సత్కారించారు. లలితా సహస్రనామ పారాయణం చేస్తే మనశాంతి లభిస్తుందని లలిత కామేశ్వర స్వామి సేవ సమితి అధ్యక్షురాలు వరలక్ష్మి భక్తులకు సూచించారు.

ఈరోజు

గణేష్ మహోత్సవ కేంద్ర సమితి అభినందన సభ

కర్నూలు కల్చరల్: గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు వీఆర్ కాలనీలోని ఏపీ టూరిజం ఫంక్షన్ హాల్‌లో అభినందన సభ ఏర్పాటు చేసినట్లు సమితి నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు తెలిపారు. సమితి ఆధ్వర్యంలో 2023 గణేష్ నిమజ్జన ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా ఈ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయ తాత జయంతి ఉత్సవం

కర్నూలు కల్చరల్: మద్దూరు నగర్ పింగళి సూరన తెలుగు తోటలో గ్రంథాలయ తాతయ్య ముచ్చుకోట వెంకటరామయ్య జయంత్యుత్సవాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సాహితీ సదస్సు కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ తెలిపారు. సాహితీ వేత్తలు, సాహితీ ప్రియులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

స్పోర్ట్స్

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్) : జిల్లా స్థాయిలో రాణించిన రగ్బీ క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలోనూ సత్తాచాటాలని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్- అండర్ 19 జిల్లా కార్యదర్శి పద్మావతి అన్నారు. శనివారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో రగ్బీ క్రీడాంశంలో ఎంపిక పోటీలు పూర్తి చేసి మాట్లాడారు.

కర్నూలు (టౌన్) : జుడో క్రీడా జు జిట్ పోస్టర్లను శనివారం మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ తన స్వగృహంలో ఆవిష్కరించారు. జు జిట్ అసోసియేషన్ అధ్యక్షుడు షకీల్ మాట్లాడుతూ జు జిట్ వంటి జుడో పోటీలను ఆదివారం స్థానిక కొత్తబస్టాండ్ వద్ద ఉన్న యూకాన్ ప్లాజాలోని 4 వ ఫ్లోర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

అన్నమయ్య జిల్లా యువకుడి ఆత్మహత్య

కర్నూలు : అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన నరసాపురం పెంచల సురేంద్ర (23) కర్నూలులోని కనిష్క ఇన్ లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్నాడు. పెంచల సురేంద్ర కర్నూలులోని ఆర్ఆర్ క్రిస్టియన్ కాలేజీలో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేశాడు. సప్లిమెంటరీ బీఎస్సీ నర్సింగ్ ఎగ్జామ్ ఉన్నందున ఈనెల 5న గాయత్రి ఎస్టేట్ వద్ద గల కనిష్క ఇన్ లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాడు. మోతాదుకు మించి మత్తు ఇంజక్షన్లు వేసుకుని తలుపులు బిగించుకుని బెడ్డుపైనే పడుకుని మృతిచెందాడు. 6తేదీ రాత్రి గదిలో నుంచి దుర్వాసన రావడంతో లాడ్జి నిర్వాహకులు పోలీసులకు సమాచారమిచ్చారు. వారు రూమ్ నంబర్ 311 తలుపులు బద్దలు కొట్టి చూడగా బెడ్‌పై మృతదేహం కనిపించింది. అక్కడ దొరికిన ఆధారాలతో తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రిలోని మార్చురీకి తరలించి సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

కల్లూరులో వ్యక్తి కిడ్నాప్... ఆపై దాడి

కర్నూలు : తన కూతురితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న కోపంతో బోయ వెంకటేశ్వర్లును కిడ్నాప్ చేసి దాడి చేసిన ఘటన కల్లూరులో కలకలం రేపింది. పందిపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ప్రస్తుతం గూడూరులో ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓ వివాహితతో సన్నిహితంగా ఉండి ఫొటోలు దిగాడు. తర్వాత ఆ ఫొటోలను వివాహిత భర్తకు వాట్సాప్ ద్వారా పంపడంతో వెంకటేశ్వర్లును ఎలాగైనా అంతమొందించాలనుకున్నారు. వివాహిత కుటుంబసభ్యులు, మరో ఆరుగురు కలిసి పందిపాడు మద్యం గోడౌన్ దగ్గరి నుంచి వెంకటేశ్వర్లును కిడ్నాప్ చేసి అలంపూరు దగ్గరకు తీసుకెళ్లి కొట్టి వదిలేసి వెళ్లిపోయారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదుతో నిందితుల కోసం గాలిస్తున్నట్లు నాలుగో పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు.

ఈకేవైసీ పేరుతో మోసం

డోన్ టౌన్: పట్టణంలోని పాతపేటకు చెందిన ప్రతిభ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆన్‌లైన్ మోసానికి గురైంది. ఈకేవైసీ పేరుతో ఫోన్ చేసి బ్యాంక్ ఖాతా నుంచి క్షణాల్లో రూ. 14 లక్షలు మాయం చేశారు. ఈ ఘటనపై బాధితురాలు శనివారం డోన్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్‌లో పనిచేసే ఉద్యోగి ప్రతిభకు నాలుగు రోజుల క్రితం ఓ ఫోన్ కాల్ వచ్చింది. మీరు ఈకేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని చెప్పి లింక్ పంపారు. నమ్మిన సదరు ఉద్యోగి దానిని ఓపెన్ చేసి బ్యాంక్ వివరాలు నమోదు చేశారు. క్షణాల్లో ఆమె బ్యాంక్ ఖాతాలో నుంచి రూ. 14 లక్షలు మాయమయ్యాయి. మోసపోయానని గమనించిన ఆమె శనివారం డోన్‌కు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే వారు సాంకేతిక పరిజ్ఞానంతో కేటుగాడి అకౌంట్‌ను సీజ్ చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

క్లాప్ డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): క్లాప్ డ్రైవర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఆ యూనియన్ ఆధ్వర్యంలో క్లాప్ డ్రైవర్లు తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10 నెలల నుంచి క్లాప్ డ్రైవర్లకు వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. జీతాలు అడిగారని తొలగించడం అన్యాయమన్నారు. మునిసిపల్ కమిషనర్ స్పందించి తొలగించిన వారిని విధుల్లోకి తీసుకొని పెండింగ్ వేతనాలు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో అబ్దుల్‌దేశాయ్, మారెళ్ల విజయ్ షరీఫ్, నరసింహులు మోహిద్దీన్ పాల్గొన్నారు.

కాలువ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని 17వ వార్డులో మురికి కాలువను ఆక్రమించుకుని పెద్ద అపార్టుమెంట్ కడుతున్న డాక్టర్ శ్రీనివాసులు రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం అక్రమ నిర్మాణం జరుగుతున్న ప్రాంతాన్ని సీపీఐ నాయకులు పరిశీలించి మాట్లాడారు. అక్రమణలపై మునిసిపల్ అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను విడుదల చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి సి.మహేష్ డిమాండ్ చేశారు. శనివారం డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధి కోసం కేటాయించాల్సిన సబ్‌ప్లాన్ నిధులను విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో దళిత, గిరిజన కాలనీల్లో సమస్యలు పేరుకుపోవడంతో ఆయా వాడల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.రామచంద్రుడు, కుమార్, విజయమధు, కృష్ణ, మహేష్, చిన్న ఆంజి, నరేష్ పాల్గొన్నారు.

కల్లూరు ఏఓ అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలి

కర్నూలు(సెంట్రల్): కల్లూరు మండల వ్యవసాయాధికారి(ఏఓ)శ్రీనివాసరెడ్డి అవినీతి, అక్రమాలపై తక్షణమే సమగ్ర విచారణ జరపాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ..కల్లూరు మండలంలో నకిలీ విత్తనాలను వ్యాపారులు ఏఓ సహకారంతో రైతులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. నకిలీ విత్తనాలు అమ్ముకోవడానికి విపరీతంగా ముడుపులు తీసుకుంటున్నారని, ఇటీవల రాఘవేంద్ర సీడ్స్ షాపులో కాలం చెల్లిన విత్తనాలు అమ్మినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆయన విత్తనాల వ్యాపారులతో కుమ్మక్కై రైతులను నట్టేట ముంచుతున్నారని, దీనిపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కల్లూరు మండల కార్యదర్శి ఎ.కృష్ణ, నాయకులు మృత్యుంజయుడు పాల్గొన్నారు.